# కలెక్టర్ ను కలిసిన ఎస్పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఇటీవలే బదిలీల్లో భాగంగా నూతనంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ రాహుల్ శర్మాను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతనంగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 19 జూన్, 2024 | పేజీలు : 05


### అదును సూచి నకిలీ విత్తనాల జోరు..

# రైతులను మోసం చేస్తున్న మాయగాళ్ల తీరు

గుంటూరు పల్లి కేంద్రంగా జో (జూ)టదారుల జోరు

నకిలీ విత్తనాల తో మోసపోతున్న రైతులు

తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

టస్క్ ఫోర్స్ మెరుపు దాడులు చేయాల్సిందే అంటున్న రైతులు

ఇద్దరు ఇద్దరే ఎంఎల్ఏ అనుచరులమంటూ నకిలీ లలు

**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాల మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా మండలంలో వరి 7500 ఎకరాలు, ప్రత్తి 14,000 వేల ఎకరాలు, మిర్చి 3500 ఎకరాలలో మండలంలోని రైతులు సాగు చేస్తున్నట్లు, మండలంలో 25 గ్రామ పంచాయతీలలో ఫర్టి లైజర్, పెస్టిసైడ్ షాపులు 41 ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉంటే మండలంలోని గ్రామాలలో ప్రత్తి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగులోకి సిద్ధం కావడంతో వ్యవసాయ అదికారులు ఫర్టలైజర్,ఫస్టిసైడ్ దుకాణదారులకు ఎలాంటి నకిలీ విత్తనాలు, అధిక రేట్లు, బిల్లులు లేకుండ అమ్మకాలు జరుపకూడదని ముందస్తు అవగాహన కల్పించినప్పటికి అదును చూసుకొని కొంతమంది ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాప్ ల యాజమానులు పత్తి విత్తనాల నకిలి దోపిడీకి పాల్పడుతు ఒక్కో ప్యాకేట్ కు గవర్నమెంట్ రేటు 864 రూపాలు ఉండగా షాప్ ల వాళ్ళు ఒక్కోరకం బస్తాలకు 3 వేలు దొంగ సాటున బ్లాక్ రేట్లతో అమ్మతు, కొన్ని రకాల బస్తాలకైతే 2 వేల చొప్పున, మరికొన్ని బస్తాలకు 13 నుండి 15 వందల వరకు గుట్టు సప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసి నకిలీ సీడును రైతులకంటగడుతూ కొన్నిప్యాకేట్లకు బిల్లులు లేకుండ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని షాపు యజమానులు రైతులకు మాయ మాటలు చెబుతూ ఈ రకం బాగుంటుంది ఆ రకం బాగుంటుంది అంటూ వాళ్ళ మాయలో దింపుకొని రైతులను అమాయకులుగా చేసి అడ్డగోలుగా రూపాయలు దండుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పబ్లిక్ టాక్**

ఇద్దరు నకిలీ కోరులు అదును చూసి రైతులను దోచేస్తున్నారు కొందరు మండలంలో ఎంఎల్ఏ ముఖ్య అనుచరులమంటూ ఎంఎల్ఏ పేరును బదునం చేస్తూ రైతులను మోసం చేస్తూ రాష్ట్రంలో పరిమిషన్ లేని నిషేధిత గడ్డిమందు రకం గ్లైపోసిల్ త్రిబుల్ బీటి పత్తి రకం, మిర్చ విత్తనాలు మండలంలోని గుంటూరు పల్లి కేంద్రంగా ఇద్దరు ఇద్దరే




తరువాయి 2లో

### ధరణి పెండింగ్ ధరఖాస్తుల

# నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి




ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ధరణి పెండింగ్ ధరఖాస్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం మండలంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని, పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల నమోదు ప్రక్రియను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ధరణి దరఖాస్తుల నమోదులో ఎటువంటి అలసత్వం వహించరాదని, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ దరఖాస్తులను ప్రణాళికబద్ధంగా ప్రత్యేక కార్యచరణతో పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుల స్కానింగ్, తదితర ఆధారిత డాక్యుమెంట్‌ల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. సంబంధించిన వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ మీకు ప్రతి రోజు మంచినీరు సరిగ్గా వస్తున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందికి సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేసి విధులకు రాని వైద్యులపై చర్యలు చేపట్టి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు.

### నీట్ పేపర్ లీకేజిపై

# జ్యుడిషియల్ విచారణ జరపాలి

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** నీట్ పేపర్ లీకేజిపై జ్యుడిషియల్ విచారణ జరపాలి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే5వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షను దాదాపుగా 24 లక్షల మంది విద్యార్థులు రాశారని, జూన్ 4న విడుదలైన నీట్ ఫలితాలలో ఎన్నడూ లేని విధంగా 67 మందికి 720/720 మార్కులు వచ్చాయని, టాప్ స్కోర్ వచ్చిన 67 మందిలో 6గురు హర్యాణాలోని ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయని తెలిపారు.పరీక్షకు ఒక రోజు ముందే మే 4న పక్కా ప్లాన్ ప్రకారం పేపర్ లీక్ చేయడం, ఇందుకోసం బీహార్‌కు చెందిన ముఠా 35 మంది విద్యార్థుల నుండి రూ.30 లక్షల చొప్పున భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు తేలిందని తెలిపారు. పేపర్ లీకేజి వ్యవహారం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, విద్యార్థుల జీవితాలతో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటం ఆడాయని ఆరోపించారు. కేంద్రం అసమర్థత, అధికారుల అలసత్వం కారణంగా లక్షలాది మంది నీట్ పరీక్షను రాసిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నోరు మెదపడం లేదని, ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజి ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని,ప్రత్యక్షంగా నిర్వహించుకునేందుకు వైద్య విద్య ప్రవేశ పరీక్షను రాష్రాలకు అప్పగించాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశరు.



# కొనసాగుతున్న జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం హన్మకొండలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ప్రతిల్ పోటీలను ఐజేయు అనుబంధ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అలాగే మరో టీమ్‌ను టీయూడబ్ల్యూజే143 జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మస్నపురి సుధాకర్, నాయకపు సుభాష్‌లు ప్రారంభించారు. అనంతరం పలు టీమ్‌ల మధ్య షటిల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కాలంతో పోటీపడుతూ పని చేసే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆట విడుపుగా పని చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను, దుర్గ ప్రసాద్, అల్లం రాజేష్ వర్మ, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్, బూర్ల నరేందర్, పొడిశెట్టి విష్ణు వర్దన్, ఈసి మెంబర్‌లు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికకు సిద్ధం కావాలి

ప్రజాపక్షం/జనగామ టౌన్: స్పోర్ట్స్ స్కూల్ నాలుగవ తరగతిలో ప్రవేశాల కొరకు విద్యార్థిని, విద్యార్థులు ఎంపికకు సిద్ధం కావాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతి ప్రవేశాల కొరకు మండల స్థాయిలో ఈనెల 21వ తేదీ నుండి 25 వరకు ఎంపిక కార్యక్రమం చేపట్టిందని మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈనెల 29న జిల్లాస్థాయిలో ధర్మకంచలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికొరకు ప్రస్తుతం చదువుతున్న స్కూల్ నుండి స్టడీ సర్టిఫికెట్ తీసుకోవాలని, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాన్నారు. ప్రస్తుతం దిగిన 10 పాస్‌ఫోటోలు, మూడవ తరగతి ప్రోగ్రెస్ కార్డ్, ఆధార్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం వంటి ధ్రువీకరణ పత్రాలతో అర్హత గల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే ఎంపికకకు ఈనెల 29వ తేదీన ఉదయం ధర్మకంచలోని మినీ స్టేడియంలో హాజరుకావాలని కోరారు.

## అమృత వర్షినిలో అన్నదానం



ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ : ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్ మాదిగ అంబేద్కర్ విగ్రహానికి పూల వేసి కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేసారు. అనంతరం భూపాలపల్లి లోని అమృత వర్షిణి అక్షర స్వచ్ఛంద సేవ సంస్థ లోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి శీలపాక హరీష్ మాదిగలు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ మలిదశ ఉద్యమాన్ని ఉద్ధృతాలుగించి వర్గీకరణ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయిన యువ నాయకుడు వంగపల్లి శ్రీనివాస్ అని కొనియాడారు. కార్యక్రమంలో భూపాలపల్లి సోషల్ మీడియా ఇంచార్జి శీలపాక నరేష్, జిల్లా సీనియర్ నాయకులు బచ్చల చిరంజీవి, మండల నాయకులు వైకుంఠం, డేవిడ్,శంకర్, రాజకుమార్, రాకేష్, శివ, సమ్మయ్య లు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత లక్ష్మీ నారాయణగౌడ్ సన్మానం



ప్రజాపక్షం/ హన్మకొండ టౌన్ : రేగొండ మండలం లోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దేశిని లక్ష్మీ నారాయణగౌడ్‌కు రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీతకు సీఆర్పీఎఫ్‌చే మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రంగయ్యపల్లికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీ నారాయణగౌడ్‌కు హన్మకొండలోని సీఆర్పీఎఫ్ 54వ బెటాలియన్‌లో మంగళవారం కమాండెంట్ మోహన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవార్డు గ్రహీత దేశిని లక్ష్మీ నారాయణగౌడ్ తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌కు రక్తాన్ని అందించినందుకు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రజా చైతన్య సేవా అవార్డును అందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మోహన్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం తన వంతుగా బహువిధ సేవలు అందిస్తూ లక్ష్మీ నారాయణ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్లు సుమ, తులసి, దుర్గామాత దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు లలిత్ అగర్వాల్, హిత పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, లక్ష్మీ నారాయణగౌడ్ అనేక ప్రజా సేవ సంక్షేమ కార్యక్రమాల్లో అవార్డు అందుకున్న నేపథ్యంలో రంగయ్యపల్లి గ్రామానికి చెందిన యువకులతో పాటు మండలంలోని పలు గ్రామాల స్నేహితులు, ఉపాధ్యాయ బృందాలు అభినందనలు తెలిపారు.

## సిరిసిల్ల రాజయ్యను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణులు బొయిని రాజు, దామెర రాజులు మంగళవారం హైదరాబాద్‌లో ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను వారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శుభాకాంక్షలు తెలిపిన జెడ్పిటిసి



ప్రజాపక్షం/లింగాలఘణపురం: సోషల్ మీడియా కన్వీనర్ మేడ ప్రశాంత్ పుట్టినరోజు సందర్భంగా లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి కేక్‌కట్‌చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర నాయకులు కీసర దిలీప్‌రెడ్డి, దూసరి గణపతి, జిల్లా బీసీ సెల్ చైర్మన్ లోక్కుట్ల ప్రవీణ్, సాదం విజయ్ మనోహర్, పాక్స్ డైరెక్టర్ గుర్రం బాల రాజు, మార్కెట్ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు, నర్సింగ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బలరామ్‌ను వెంటనే ఉరి తీయాలి



ప్రజాపక్షం/హసన్‌పర్తి: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ కట్నపల్లిలో రైస్‌మిల్లులో ఆరేళ్ల చిన్నారి సహస్రపై దాష్టీకానికి పాల్పడిన బలరాంను వెంటనే కఠిన శిక్ష విధించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ డబ్ల్యూఈఓ చైర్మన్ మహ్మద్ మొయినొద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మొహినొద్దీన్ మాట్లాడుతూ.. పసిపాపలపై జరుగుతున్న అరాచకాలపై తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి సత్వరమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలు, స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, దోషులను బహిరంగంగా శిక్షలు వేస్తే రానున్న రోజుల్లో ఇలాంటి దుశ్చర్యలు జరుగవన్నారు. బలరాం లాంటి మృగాలకు తగిన శిక్ష వేసి మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కల్పించిన రోజే వారు స్వేచ్ఛగా జీవించగలుగుతారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ డబ్ల్యూఈఓ మహిళా విభాగ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఫరాన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి వేణుగౌడ్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్గనైజేషన్ సభ్యులు రఘువీర్, నద్దునూరి బాబు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ లో జరిగిన అల్లర్లకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు



ప్రజాపక్షం/నిజాంపేట్: మెదక్ లో జరిగిన రెండు వర్గాల ఘర్షణకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వెయ్యి సంవత్సరాలుగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న జాతుల మధ్య ఇలాంటి సంఘటనలను కాంగ్రెస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నామన్నారు. భారతదేశంలో అన్ని వర్గాల వారిని సమానంగా చూసుకుంటూ హిందూ ముస్లిం భాయ్ అని కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. గత వెయ్యి సంవత్సరాలుగా మెదక్ లో జరగని అల్లరు బిజెపి ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలిచిన తర్వాతనే అల్లర్లు జరుగుతున్నాయని కుల మతాల మధ్య చిచ్చు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ గొడవలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి కుటుంబాన్ని విమర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, అధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, తాజా మాజీ సర్పంచులు అమరసేన రెడ్డి,కొమ్ముటసత్యనారాయణ, పాల్గొన్నారు

## నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా రావుల హరీష్‌రెడ్డి



ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా రావుల హరీష్‌రెడ్డి ఎంపికయ్యారు. వైస్ చైర్మన్‌గా మానుకోట జిల్లా గూడూరు మండలానికి చెందిన ఎద్ద నరసింహారెడ్డి నియమించబడ్డారు. రావుల హరీష్ రెడ్డి ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. హరీష్‌రెడ్డి సేవలను గుర్తించి దొంతి మాధవరెడ్డి సిఫారసుతో రాష్ట్రం మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారికంగా ప్రకటించారు. శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అమెరికా పర్యటనలో ఉన్నందున దొంతి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. తన ఎంపికై ప్రభుత్వానికి తన పేరును సిఫారసు చేసినందుకు శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని రావుల హరీష్‌రెడ్డి అన్నారు.

## పొట్టి గుబ్బడి తండాలో వెలిసిన అక్రమ వెంచర్





ప్రజాపక్షం/రఘునాథపల్లి: మండలంలోని పొట్టి గుబ్బడి తండా గ్రామ పంచాయితి పరిధిలో సర్వేనెంబర్ 971, 972, 975 ఎకరం 20 గుంటల భూమిలో హైదరాబాద్‌కు చెందిన కొందరు రియల్టర్లు భూమిని కొనుగోలు చేయడం జరిగింది. కొనుగోలు చేసిన భూమిలో రియాల్టర్లు ఎలాంటి డీటీసీపీ అనుమతులు లేకుండా అక్రమంగా లే అవుట్ చేసి ప్లాట్లు చేయడం జరిగింది. అంతేగాకుండా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఆఫీస్ తెరిచి స్వాన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అన్న నామకరణంతో ఇందులో మెంబర్ షిప్ పేరుతో కేవలం రూ.1లక్ష69 వేలకు 60 గజాలు, రూ.1లక్ష 99వేలకు 100 గజాలు ఇస్తామంటూ బ్రోచర్ రిలీజ్ చేయడం జరిగింది. అంతేగాకుండా ఇందులో మెంబర్ షిప్ తీసుకున్న వారికి ప్లాట్‌తోపాటు సంవత్సరానికి ఐదురోజులు స్వామి హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో అన్ని వసతులతో బస ఏర్పాటు, రూ.5లక్షల ప్రమాద భీమా సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందంటూ అమాయక ప్రజలను నమ్మబలికి దాంతో సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మండల పంచాయితి అధికారుల ఆదేశాలతో అట్టి స్థలాన్ని గ్రామ పంచాయితి కార్యదర్శి పరిశీలించి ఎలాంటి డీటీసీపీ అప్రూవల్ గాని, గ్రామ పంచాయితి అనుమతులు గానీ లేకుండా అక్రమంగా లే అవుట్ చేసిన సదరు నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడం జరిగింది. దీనికి సంబంధించిన మూడు రోజులలో అన్ని అనుమతులు తీసుకుని గ్రామ పంచాయితి నుండి అనుమతులు పొందిన తర్వాతే క్రయ,విక్రయాలు జరుపుకోవాలని అధికారులు ఆదేశించారు. లేనిపక్షంలో అక్రమంగా వేసిన లేఅవుట్ ప్లాట్‌లను తొలగించడం జరుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసే ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారుల పట్ల సంబంధిత అధికారులు గట్టి చర్యలు తీసుకుని అమయాకపు ప్రజలు మోసపోకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా తప్పదు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్ పేట మున్సిపల్ పరిధిలోని ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఇ జోనా అన్నారు మంగళవారం వారు మాట్లాడుతూ వర్ధన్న పేట పురపాలక సంఘం పరిధిలోని జాతీయ రహదారిపై విధి విక్రయాదారులు, చికెన్, మటన్ షాపు, హోటల్ వినియోగదారులకు (యజమానులు ) షాపులలో వుండే చెత్త మున్సిపల్ ట్రాక్టర్ లో లేదా డంపింగ్ యార్డ్ దగ్గర మాత్రమే చెత్తను వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసినచో చట్టరీత్యా చర్యతో పాటు 5000/ జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. వ్యాపారస్తులు, ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కోరారు.

# నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా రావుల హరీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నెక్కొండః** వరంగల్ జిల్లా నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా రావుల హరీష్‌రెడ్డి ఎంపికయ్యారు. వైస్ చైర్మన్‌గా మానుకోట జిల్లా గూడూరు మండలానికి చెందిన ఎడ్ల నరసింహారెడ్డి నియమించబడ్డారు. రావుల హరీష్‌రెడ్డి ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. హరీష్‌రెడ్డి సేవలను గుర్తించి దొంతి మాధవరెడ్డి సిఫారసుతో రాష్ట్రం మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రకటించారు. శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అమెరికా పర్యటనలో ఉన్నందున దొంతి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. తన ఎంపికై ప్రభుత్వానికి తన పేరును సిఫారసు చేసినందుకు శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని రావుల హరీష్‌రెడ్డి అన్నారు.

# గ్యాస్ సబ్సిడీ అందక లబ్దిదారుల ఆందోళన

**ప్రజాపక్షం/నెక్కొండః** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికలలో ఆరు గ్యారెంటీలు అనే హామీలతో గ్యాస్ సిలిండర్‌కి సబ్సిడీ ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు వరకు గ్యాస్ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం 374...470 చొప్పున కొందరికి మాత్రం, 2024 మార్చి నెల వరకు చెల్లించింది. ఆ తర్వాత ఏ ఒక్క లబ్దిదారుడికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం రూ.47 రూపాయల 38పైసలు ఎన్నికల కోడ్ అనంతరం సైతం నేటి వరకు చెల్లిస్తూ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల కోడ్ విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న సబ్సిడీ ఆగిపోయింది. ఎన్నికల కోడ్ ఎన్నికల సంఘం ఎత్తివేసింది. అయినా నాటి నుండి నేటి వరకు నిత్యం గ్యాస్ వినియోగదారులు గ్యాస్ డీలర్‌ను, మండల పరిషత్ కార్యాలయంలోని సిబ్బందిని, సబ్సిడీ డబ్బులు ఎప్పుడు వస్తాయంటు నిత్యం వేధించడంతో మండల పరిషత్ సిబ్బంది, గ్యాస్ డీలర్ సిబ్బంది, తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాపాలనలోని దరఖాస్తు గ్యాస్ డీలర్ల వద్ద అప్‌లోడ్ చేయించుకున్న కానీ నేటికి సబ్సిడీ రాకపోవడం ఇది ఆరంభ శురత్వమేనా ఆచరణలో ఉంటుందా లేదా అనేది ప్రభుత్వం, అధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది



**ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తుందని, భూపాలపల్లి బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కడారి మాలతి అన్నారు. మంగళవారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడారి మాలతి పాల్గొని మాట్లాడుతూ నిన్న భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్లో బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇల్లు లేని పేదవాడికి లబ్ధి చేకూరే విధంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చూసుకుంటాడని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని ఎవరి ప్రలోభాలకు లొంగవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వావిళ్ళ కోమల, అర్బన్ ప్రధాన కార్యదర్శి జంబోజు పద్మ, బట్టు శ్రీలత, ఎద్దు పుష్ప, నాలిక పరమేశ్వరి, పద్మ, శారద, మంగ సారక్క, మహిళా కౌన్సిలర్లు రేణుక, రజిత, తదితరులు పాల్గొన్నారు.

# సీతక్క సేవలకు చిరకాలం రుణపడి ఉంటాం



**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామానికి బస్సు కావాలని అడగ్గానే వెంటనే స్పందించి ఒక్కరోజు కాల వ్యవదిలో బస్సు ని ప్రారంభించడము జరిగినది. నర్సింహసాగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై హర్షం వ్యక్త పరచారు. తమ సమస్యలపై వెంటనే స్పందిస్తున్న మంత్రి సీతక్క కి రుణపడి ఉంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు సీతక్క ను కొనియాడారు. ఈ కార్యక్రమములో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటినేని హరికృష్ణ, మండల పార్టీ ఉపాధ్యాక్షులు గాదే శ్రావణ్, మండల యూత్ అధ్యక్షులు మురుకుట్ల నరేందర్, జిల్లా బిసి సెల్ ప్రధానకార్యదర్శి కాటబొయిన నర్సింహారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లోకు సత్యం, గూడూరు రామ్మూర్తి, అన్నల వెంకన్న, శేషగిరి, నర్సింహారావు, గూడూరి రవి, బుచ్చి రాములు, దోమల నరేందర్, కుంటా శంకర్, బండారి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి ప్రభాకర్, మూత్తినేని నర్సింహారావు, యూత్ నాయకులు, కోడం శ్రీకాంత్ బొడ సతీష్, నైనారపు రాజు, వెల్పుల గణేష్ తదితరులు గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# మీ సేవా కేంద్రాల్లో పన్నులు చెల్లించాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బల్దియా వ్యాప్తంగా ఉన్న అన్ని మీ సేవా కేంద్రాల్లో ప్రజలు పన్నులు చెల్లించవచ్చునని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులు డిప్యూటీ కమిషనర్‌లతో రెవెన్యూ సంబంధిత అంశాలపై ఏర్పాటుచేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను చెల్లింపులకు సంబంధించి 66 డివిజన్‌ల వ్యాప్తంగా ఉన్న గృహ యాజమాన్యాలకు డిమాండ్ నోటిసులు అందజేయాలని, సాంకేతిక కారణాల వలన ఇటీవల మీ సేవా కేంద్రాల్లో పన్నులు చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయిన దరిమిలా అట్టి అవకాశాన్ని పునరుద్దరించడం జరిగిందని, జులై 1 నుండి ఆఫీసర్ కార్యాలయాలలో కూడా పన్నులు చెల్లించవచ్చునని నగర వ్యాప్తంగా ఉన్న 12 మీ సేవా కేంద్రాల్లో పన్ను చెల్లింపులు చేయవచ్చునని బల్దియాకు చెందిన షాపు లీజులకు సంబంధించిన దస్త్రాన్ని తనకు పంపించాలని, నీటి పన్ను చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించి పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని కమిషనర్ అన్నారు.

# కాలం చెల్లిన సిద్ధాంతాలకు ఆకర్శితులవ్వొద్దు




**ప్రజాపక్షం/మహాదేవపూర్:** యువత కాలం చెల్లిన సిద్ధాంతాలకు ఆకర్శితులై జీవితాలను పాడు చేసుకోవద్దని పలిమెల ఎస్సై తమాషా రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో పాటు పంకెన, సర్వాయిపేట్, బూరుగు గూడెం, నీలంపెల్లి, ముకునూరు గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో మావోయిస్టుల వాల్ పోస్టర్లు,ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.అనంతరం ఎస్సై తమాషా రెడ్డి మాట్లాడుతూ కాలం చెల్లిన సిద్ధాంతాలతో,హింసను ప్రేరేపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే మావోయిస్టులతో అభివృద్ధి జరగదని అన్నారు.యువత కాలం చెల్లిన సిద్ధాంతాలకు ఆకర్శితులు కావద్దని చదువు పై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని అన్నారు.గ్రామాల్లో మావోయిస్టులకు సహకరించి అభివృద్ధిని ఆడ్డకోవద్దని అన్నారు.మావోయిస్టులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వివరాలు గోప్యంగా ఉంచుతామని,కాదని సహకరించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.గ్రామాల్లో కొత్తవారు వచ్చిన వారిని మావోయిస్టులు గా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్,సిఆర్పిఫ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బండి సంజయ్‌ని కలిసిన దినేష్



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా భాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ కుమార్‌ని బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం దినేష్ మాట్లాడుతూ బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కడం పట్ల సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్ఐ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ఏటూరు నాగారం:** బదిలీపై వెళ్తున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సేవలు అభినందనీయమని మండల అధ్యక్షులు చిటమట రఘు అన్నారు. ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ కు నూతన సిఐ గా నియమితులైనా అనుముల శ్రీనివాస్ ఎస్ఐ తాజుద్దీన్ ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బదిలీ పై వెళుతున్న ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ సార్ సేవలను అభినందించి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పాల్గొన్నారు.

# మంగపేట నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన టివిఆర్ సూరి



**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా మంగపేట మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా టివిఆర్ సూరి మంగళవారం రోజున బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై టీవిఅర్ సూరి కి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



**ప్రజాపక్షం/టేకుమట్ల :** శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్ పేర్కొన్నారు. టేర్కోన్నారు మండలంలోని కుందనపెల్లి గ్రామంలో నూతనంగా ఎల్లమ్మ తల్లి విగ్రాహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాల్గోన్నారు.ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి,పశు సంపదతో ,పాడి పంటలు పండి,పిల్ల పాపలతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జోవించాలని అన్నారు.ఎల్లమ్మ తల్లి విగ్రాహాన్ని బహుకరించిన మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్‌కు కాలని వాసులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్,పాల్గోన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయని సిఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/గజ్వేల్:** రాజకీయ లబ్ధికోసం హామీలు గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం వాటి ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటని, అయితే ఘోరంగా విఫలం చెందిన ఆయన వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గజ్వేల్ క్యాపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై అవగాహన లేకుండా మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి కొత్త కొత్త కొర్రీలు పెడుతున్నట్లు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని ఆరోపించారు. కెసిఆర్ లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపి కుట్రలు పన్నుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం దివాల అంచుల్లో ఉందని, జీతాలు, పథకాల కోసం పెద్ద ఎత్తున అప్పులు చేస్తున్నట్లు ఎద్దేవా చేశారు. ఎన్ని కుట్రలు పన్నినా కేసీఆర్, కెసిఆర్ కుటుంబాన్ని ఎవరూ ఏమీ చేయలేరని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వుడెం కృష్ణారెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు అల్వాల బాలేష్, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, నాయకులు విరాసత్ అలీ, దయాకర్ రెడ్డి, నర్సింగరావు, షరీఫ్, ఉమర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ..

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీసులో మంగళవారం సాయంత్రం దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుక పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి,శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావులు పోస్టర్‌ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల స్టేడియంలో ఈ నెల 21న ఉదయం 5:30 గంటలకు యోగా దినోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. యోగా సంస్థలు, సేవా సంస్థలు, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట యోగాసన స్పోర్ట్ అసోసియేషన్, భారత స్వాభిమాన ట్రస్ట్, వ్యాస మహర్షి యోగా సొసైటి ప్రతినిధులు తోట అశోక్,నిమ్మ శ్రీనివాస్ రెడ్డి,తోట సతీష్, ఆయిత అంజయ్య, కల్లెపల్లి శ్రీనివాస్, తోట సంధ్య, హరిప్రసాద్ చశశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా శశిధర్



**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ గంప నాగేశ్వరరావు స్థాపించిన ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రైనర్ గా పిఆర్టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ ఎంపికయ్యారు. 45 రోజులుగా ఆన్లైన్ జూమ్ ప్లాట్ ఫామ్ లో ఇంపాక్ట్ ఫౌండేషన్ స్ఫూర్తి నిర్వహించిన ఆన్లైన్ ట్రైనింగ్ ట్రైనర్ వర్క్ షాప్ లో పాల్గొని ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్యామ్ రాథోడ్ చేతుల మీదుగా ఉత్తమ శిక్షకునిగా మంగళవారం ఆదరాసుపల్లి శశిధర్ శర్మ సర్టిఫికెట్ అందుకున్నారు. వర్క్ షాప్ లో ప్రదీప్, శ్యామ్ రాథోడ్, ప్రొఫెసర్ విశ్వనాథం శ్రీనివాస్ పెరుమాళ్ళ, రామచంద్రుడు తదితర 22 మంది ప్రముఖ వక్తలు పాల్గొని శిక్షకులకు ట్రైనింగ్ ఇచ్చారు. బ్యాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వర రావు జూన్ ప్లాట్ ఫామ్ వేదికగా శశిధర శర్మను అభినందించారు.

## రేణుక మాతాకు అభిషేకం



**ప్రజాపక్షం/కొల్చారం:** అమ్మా రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని పాల్వంచ లక్ష్మి శేఖర్ గౌడ్ దంపతులు కోరుకున్నారు. అమ్మను నమ్ముకుని చేసిన పనులు సత్ఫలితాల నిస్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 25వ మంగళవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పాల్వంచ లక్ష్మి శేఖర్ గౌడ్ దంపతులచే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక, అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా చల్లూరి కృష్ణ శర్మ, సాగరికల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, పాపగౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, సంజీవ్ రావు, యాదగౌడ్, కిట్టు గౌడ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపి రఘునందన్ రావు సమక్షంలో బిజెపిలో భారీగా చేరికలు

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్,భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సమక్షంలో మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన 30 మంది యువకులు, వివిధ పార్టీల కార్యకర్తలు, గ్రామస్తులు మంగళవారం బిజెపి పార్టీలో చేరారు. వారికి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు బిజెపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కూచారం మాజీ సర్పంచ్ జక్కిడి నరేందర్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ చారి,బీజేవైఎం జిల్లా నాయకులు కుమ్మరి నాగరాజ్, నాయకులు ఎల్ ప్రభాకర్ గౌడ్, కుమ్మరి కృష్ణ, కొత్తూరి మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని మాధన్నపేట జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రు అన్నారు. మంగళవారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి మనది బాధ్యత మనదే, బడీడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి వేల రూపాయలను ఖర్చు చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలో అనుభవమైన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు, ఐఎఫ్‌పి బోర్డుల ద్వారా బోధన, యోగా, ఆటలు వంటి సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలల్లోనే కల్పించడం జరుగుతుందని, విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్చన, సుధారాణి, అశోక్, వెకన్న, లీలా, విశబూల, సంతోష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజన్ కుమార్, యాదగిరి, భిక్షం, రమేష్, అనూష, శోభ, పాల్గొన్నారు.

## బిజెపిపై నోరు పారేసుకోవడం ప్రతాపరెడ్డికి తగదు



**ప్రజాపక్షం/గజ్వేల్:** దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపిపై, ప్రధాని నరేంద్ర మోడీపై స్థానిక బిఆర్ఎస్ నేత, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి నోరుపారేసుకోవడం తగదని బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ను ప్రజలు చిత్తుగా ఓడించినప్పటికి ఆ పార్టీ నాయకులకు అహంకారం తగ్గలేదని అన్నారు. పదేళ్లు అధికారం వెలగబెట్టిన ఆ పార్టీ నాయకులకు గజ్వేల్ పెండింగ్ పనులపై దృష్టి పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చుండేది కాదని స్పష్టం చేశారు. రింగ్ రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఘోరంగా తయారైన గల్లి రోడ్లు, అనర్హులకు డబుల్ బెడ్ ఇండ్ల పంపిణీ, అందుబాటులో లేని బస్టాండ్ తదితర వాటిని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా ఆలోచన లేని నిర్మాణాలు, బానిసత్వపు మనస్తత్వంతో గజ్వేల్ అభివృద్ధిని అందలం ఎక్కించడంలో విఫలమైన వారు అధికారం పోయాక మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. గజ్వేల్ ప్రజలు కేసీఆర్, ఆ పార్టీ నేతలను ఎప్పుడో పక్కకు పెట్టినట్లు వివరించారు.

## సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ రేగోడ్:** గ్రామాల్లో ఏలాంటి సమస్యలు తెలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ యాదగిరి అన్నారు. రేగోడ్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ఆర్‌డబ్ల్యుస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్తు సరాఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారని అంతరాయం లేకుండా విద్యుత్తు సరాఫరా చేసి రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినందున రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా గ్రామ పంచాయితీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ యాదగిరి, పలువురు ఎంపీటీసీలకు కార్యాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారావమ్మ, ఏపీఓ జగన్‌మోహన్ సింగ్, సిద్దప్ప, చోటుమియా, నర్సింలు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి





**ప్రజాపక్షం/వెల్దుర్తి:** విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బండపోసన్ పల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వెల్దుర్తి ఎస్ఐ నవతగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బండపోసన్‌పల్లి గ్రామానికి చెందిన గుండు ప్రభాకర్ (40) తన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ రావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ చూస్తుండగా పైన ఉన్నటువంటి 11కెవి విద్యుత్ వైర్ల మీద పడడంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభాకర్ మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతిడి భార్య శ్యామల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవతగౌడ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## నీట్ పరీక్షరద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం..

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాని సిద్దిపేట నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు.నీట్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కొండల్వడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు బడికోల్ రాకేష్ యాదవ్, నంగునూర్ మండలాధ్యక్షులు పిల్లి మహేష్, గ్యార రఘుపతి, వాసరి అజయ్, నరేష్ పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోండి..



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** పోలీసులపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని,దానిని కొందరు పోలీసులు చెడగొడుతున్నారని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిపి ఆఫీసులో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇటీవల చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తపై తల్లిని చంపిన కేసు నమోదు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఏమిటని చక్రధర్‌గౌడ్ ప్రశ్నించారు. తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని కానీ పోలీసులు కొట్టడం ఏమిటని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పోలీసులను సస్పెండ్ చేపిస్తామని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో గాంధ్ల భాను,కృష్ణ,జిల్లెల్ల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు కృషి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** నులిపురుగుల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని జగదేవ్‌పూర్ ఎంపిపి అధ్యక్షులు బాలేషంగౌడ్ పిలుపునిచ్చారు. ఈ నేల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం జగదేవ్‌పూర్, తిగుల్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడి కార్యకర్తలకు వైద్యాధికారులు సత్యప్రకాశ్, రాజశేఖర్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జూన్ 20న నిర్వహించే జాతీ నులిపురుగుల దినోత్సవం విజయవంతం కోసం అందరు కృషి చేయాలని కోరారు. సంవత్సరం నుండి పందొమ్మిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నులిపురుగులు మాత్రలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యాదగిరి, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సెల్వరాజు, సిహెచ్ఒ శ్రీమతి, సెల్ట్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ పి. ప్రావీణ్య

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిసి అండ్ పిఎన్‌డిటి లింగ నిర్ధారణ నిరోధక చట్టం జిల్లా సమన్వయ కమిటి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్‌లలో అకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అలాగే పోలీసు,స్వచ్ఛంద సంస్థల సహకారంతో డేకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని అన్నారు.ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా శిక్షించబడుతారని అన్నారు.గ్రామ స్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణి స్త్రీలకు లింగ వివక్షతపై అవగాహనతో పాటు వారిపై నిఘా ఉంచాలని చెప్పారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్నటువంటి ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో లింగ నిష్పత్తి పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో గర్భిణి స్త్రీలు నమోదు చేయించుకున్నప్పటి నుంచి వారిని అనుసరించాలని అన్నారు.అనంతరం 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను,బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సాంబశివ రావు,ఏసిపి దేవేందర్ రెడ్డి, డిడబ్ల్యూఒ మధురిమ, జిల్లా కోర్టుల ముఖ్య పాలనాధికారి శోభరాణి, మారి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్ కృష్ణమూర్తి, జిల్లా ఉప వైద్యారోగ్య శాఖాధికారి యాకూబ్ పాషా, అధికారులు పాల్గొన్నారు.



## అదును సూచి నకిలీ విత్తనాల జోరు.. రైతులను మోసం చేస్తున్న మాయగాళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

జోడుగాల్లు కలిసి జాదుగాల్ల వ్యవహారం చేస్తూ నకిలీ పత్తి విత్తనాల మాయ జాలం చేస్తూ మాటలతో మోసం చేస్తూ 450 కి తెచ్చి 1500 కు అమ్మకాలు జరుపుతూ రైతులను నిలువున ముంచేస్తూ కోట్ల రూపాయలకు దగ్గరగా సొమ్ము చేసుకుంటున్నారని, పెట్టుబడులు అన్ని పెట్టి పంట దిగుబడి రాక రైతులు ఆత్మహత్య శరణ్యం అంటూ బ్రతుకులు గడిపేస్తున్నారని, నకిలీ విత్తనాలు తెచ్చి నకిలీ దందాకోరులు కలిసి చిట్యాల మండలమే కాకుండా ఇతర మండలాలలో కూడా ఈ పత్తి విత్తనాలను అమ్ముతూ, అదే కాకుండా మండలంలోని కొన్ని ఫస్టిసైడ్ షాపుల యజమానుదారులు కూడ తీసుకొని బిల్లులు లేకండా రైతులను నిలువున ముంచేస్తూ లక్షలలో సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ తతంగమంతా ఆగాలంటే మండలంలో టస్కోర్స్ అధికారులు చొరవ చూపి ముకుమ్మడి మెరుపు దాడులు జరగాల్సిందేనని రైతులు సంబంధిత అధికారులను కోరారు. ఇలాంటివి పునరావృతం మళ్లీ కాకుండా ఉండాలంటే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు చొరవ చూపి ఈ నకిలీ సీడు వ్యవహారాన్ని అరికట్టాలని కోరారు. మండలంలో శనివారం మండల, జిల్లా వ్యవసాయ అధికారులు మండలంలో నామమాత్రపు శోధాలు చేసి చేతులు దులిపేసుకున్నారని మండలంలో చర్చ ఊపందుకుంది.

## సివిల్ సర్వీసెస్ పరీక్ష ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** తెలంగాణ బిసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆద్వర్యంలో సివిల్ సర్వీసెస్ 2025 ప్రిలిమ్స్ ,మెయిన్స్ పరీక్షకు ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ కొరకు డిగ్రీ అర్హత కలిగిన సంగారెడ్డి, మెదక్ జిల్లా లకు చెందిన నిరుద్యోగ యువతి యువకులు బిసి స్టడీ సర్కిల్ వెబ్సైట్ www.tgbcstudycirclecgg gov .in ద్వారా 19.06.2024 నుండి తేది 03.07.2024 లోగా దరఖాస్తు చేసుకోగలరని సంగారెడ్డి జిల్లా బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ టీ. ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల యొక్క కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలకు మించరాదు. అర్హులైన అభ్యర్థుల నుండి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేయడం కొరకు అర్హత పరీక్ష తేది 07.0702024 నిర్వహించబడును . శిక్షణ తరగతులు తేది 18.07.2024 నుండి 18.04.2025 వరకు బిసి స్టడీ సర్కిల్ లక్ష్మి నగర్ కాలనీ సైదాబాద్ హైదరాబాద్ నందు నిర్వహించబడుతాయి. ఎంపికైన అభ్యర్థులక ప్రతి నెల లాడ్జింగ్ ,రవాణా, ప్రయోజనం కోసం నెలకు రూ 5వేలు ఒక్కసారి మాత్రమే ఇవ్వబడును. మరిన్ని వివరాలకు 08455277015,99495 , 92991 నెంబర్లను ,బిసి స్టడీ సర్కిల్ వెలుగు ఆఫీస్ క్యాంపస్ బైపాస్ రోడ్డు ప్రక్కన సంగారెడ్డి నందు కార్యాలయం పని వేళలో సంప్రదించాలని డైరెక్టర్ ప్రవీణ్ కోరారు.

## వరద ముంపు ప్రాంతాలలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** వర్షాకాలంలో వరద ముంపు ప్రాంతాలలో ఎలాంటి ప్రాణాష్టం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులకు సూచించారు. మంగళవారం ఏటూరు నాగారం మండలంలోని కొండాయి వరద ముంపు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో జరిగిన ఘటనలు పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని, వరదల సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గత వర్షాకాలంలో జంపన్న వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న కొండాయి గ్రామంలోకి వరద నీరు ఏ విధంగా వచ్చింది. ప్రవాహ ఉధృతి ఏ మేరకు ఉంది అనే అంశాలను స్థానిక తహసిల్దారును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని, గ్రామస్తులు సహకరిస్తే అన్ని సమస్యలు పరిష్కరించడానికి సులభంగా ఉంటుందని తెలిపారు. 35 లక్షల రూపాయల నిధులతో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కొండాయి వంతెన పై జరుగుతున్న తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం మండల తహసిల్దార్ జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



## నిజాం పూర్ (కె) పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ఎం.ఈ.ఓ శంకర్

**ప్రజాపక్షం/ సదాశివపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారంగా బడిబాట కార్యక్రమంలో బాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటారు. నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో మండల విద్యాదికారి ఎన్ శంకర్ పాల్గొన్నారు. మండల విద్యాధికారిన మొక్కలు నాటడానికి విద్యార్థులు పూలతో స్వాగతం పలికారు. ఎంఈఓ శంకర్ ఉపాద్యాయులు, విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటాలని ప్రతి మొకకను జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ప్రతి ఒక్కరు ప్రకృతిని ప్రేమించాలని తద్వారా ప్రకృతిని కాపాడాలన్నారు. మంచిగా చదివి గొప్పవారిగా పేరు తెచ్చుకోని అందరికి ఆదర్శంగా ఉండాలన్నారు. పాఠశాల ఆవరణలో పెంచిన మొక్కలను చూసి పాఠశాల సిబ్బందిని విద్యార్థులను ఎంఈఓ శంకర్ అభినందించారు. విద్యార్థులక మిఠాయిలు పంచారు. తదనంతరం ప్రాథమిక పాఠశాల నిజాంపూర్, జిల్లా పరిషత్ పాఠశాల సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాయులు రాజశ్రీ, మురార్షి శివకుమార్, ఉపాద్యాయులు రామకృష్ణ, సీఆర్పీలు నగేష్, రాజేశ్వర్ అంగన్వాడ టీచర్ సువర్ణ, ఆయా రుక్మిణి, సుగుణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.



## అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమాన్ అన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా పరిషత్‌లో ఛైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతాయన్నారు. గ్రామాలు, మండలాల్లో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజాపాలన పనులు పుణః ప్రారంభించాసత్మన్నారు. యాక్షన్ ప్లాన్ రూపొందించి పనులు ప్రారంభించడంతో పాటు సంబందిత శాఖల పనుల్ని ప్రతి రోజు పర్యవేక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసిలు మారపాక రవి, పుస్కూరి శ్రీనివాసరావు, బేబి, గుడి వంశీదర్‌రెడ్డి, ఎంపిపిలు మేకల వరలక్ష్మి, మేకల కళింగరాజు, చిట్ల జయశ్రీ, కోఅప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బావులచుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటుచేసుకోవాలి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** కాజీపేట డివిజన్ సర్కిల్ పరిధిలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న బావుల చుట్టూ కంచెలు ఏర్పాటుచేసుకొని రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. మంగళవారం హసన్‌పర్తి నుంచి గంటూరుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ఓ బావిని కాజీపేట ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి సీఐ జువ్వాజి సురేష్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి సంబంధించి నటువంటి రోడ్డుకు ఇరువైపులా ఉన్న బావులు, కుంటలు ఏమున్నా తరచూ వాటి వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బావులకు సంబంధించినవి, కుంటలకు సంబంధించిన యజమానులు ఎవరైతే ఉన్నారో వారందరూ ఇలాంటి రోడ్డు ప్రమాదాలకు కారణం కాకుండా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం కాని బావి నిరుపయోగంగా ఉన్నట్లయితే దానిని కూల్చడం, యజమానులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇలాంటి బావులు హసన్‌పర్తి మండలంలో ఎక్కడైనా ఉన్నా ప్రజలు పోలీసులకు సిబ్బందికి తెలియ చేయాలన్నారు. అప్పుడు పోలీసు వారు సంబంధింత భూ యజమానులను పిలిచి నివారణ చర్యలను చేపడతారన్నారు. ఇలాంటి బావుల వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు భూ యజమానులను కారకులను చేసి సంబంధిత యజమానులపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## గొర్రెల పంపిణీలో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం టిఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల పంపిణీలో జరిగిన వందల కోట్ల అవినీతినీ పై స్థాయి నుండి కింది స్థాయి వరకు సమగ్ర విచారణ చేపట్టాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం నల్లబెట్ల చిన్న రాజు జీఎంపీస్ గొర్రెల మేకల పెంపక దారుల సంఘం ఐనవోలు మండల ప్రధాన కార్యదర్శి హనుమకొండ జిల్లా కమిటీ మెంబర్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ, గొల్ల కురుమలు డిడిలు కట్టలేని పరిస్థితిలో ఉన్నవారి పేరు తో మరో కొంతమంది కట్టేటట్లు ప్రోత్సహించిన అవినీతికి పాల్పడిన డాక్టర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జూన్ 20న ప్రారంభించించింది. రాష్ట్రంలో 7,31,368 మంది గొల్ల కురుమలను లబ్దిదారులుగా ఎంపికచేసి ఇప్పటి వరకు ఆరు వేల కోట్లు ఖర్చు చేసి 4లక్షల మందికి గొర్రెలను పంపిణీ చేశారు. ఇంకా 3,31,368 మందికి ఇవ్వాల్సి ఉంది. పథకం ప్రారంభించిన ఆరు నెలల నుండే అవినీతి అక్రమాలు జరిగాయి. మొదటి విడుతలో ఈ పథకం గొల్ల కురుమలకంటే ఎక్కువగా కొంతమంది పశువుల డాక్టర్లకే. ఎక్కువ లాభం చేసింది. ప్రస్తుత ఎసిబి విచారణను రాజకీయ అవసరాల కోసం దారి మళ్లించొద్దని కోరుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేలు హనుమకొండ జిల్లాలో1079 మంది గొర్రెల కోసం ఒక్కొక్కరు రూ.43,750/ల చొప్పున డి.డి.లు తీసి రెండేండ్లుగా వేచి. చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు 90 రోజుల్లో రెండో విడుత గొర్రెల పంపిణీ పూర్తి చేస్తామని తమ మేనిఫెస్టోలో పొందు పరిచారు. కాని ప్రస్తుతం ఆ డిడిలు వాపస్ తీసుకొమ్మని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. గతంకంటే ఉత్తమంగా అమలు చేసి చూపించాలి కాని మోసం చేయాలని చూస్తే గొల్లకురుమల నుండి వ్యతిరేకత తప్పదని లింగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

